నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 08, 2025 | www.navatelangana.com

కాంగ్రెస్ నుంచి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సస్పెండ్



నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డిపై పార్టీ నుంచి సస్పెన్షన్ వేటు పడింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, వడ్డేపల్లి సుభాష్ రెడ్డి గ్రూపుల మధ్య పచ్చ గడ్డి వేస్తే దగ్గు మనేలా రాజకీయాలు నడిచాయి. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వడ్డేపల్లి సుభాష్ రెడ్డికి కాకుండా, రాహుల్ గాంధీకి సన్నిహితంగా ఉన్న మదన్ మోహన్ రావుకు ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్లు ఇవ్వడంతో, వడ్డేపల్లి సుభాష్ రెడ్డి సంతప్తితో బీజేపీ పార్టీలో చేరారు. ఎన్నికల అనంతరం తిరిగి కాంగ్రెస్ గూటికి తిరిగివచ్చారు. కాగా రామారెడ్డి మండలంలోని రంగంపేటలో సుభాష్ రెడ్డి విలేకరుల సమావేశంలో మదన్మోహన్‌రావుపై ఆరోపణలు చేయడంతో అధిష్టానానికి ఫిర్యాదులు అందాయి. సుభాష్ రెడ్డిని వివరణ కోరగా , నవంబర్ 21న వివరణ ఇచ్చిన అధిష్ఠానం ఆతప్తి చెందకపోవడంతో శుక్రవారం పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చెన్నారెడ్డి లేఖను విడుదల చేశారు.

ఇప్పుడు మీసేవ వంతు..

- ఆన్‌లైన్‌లో కొత్తరేషన్‌కార్డులు, చేరికలు మార్పులకు అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు మీ సేవ నుంచి స్వీకరించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది వరకు ప్రజాపాలన, గ్రామసభల్లో తీసుకున్న తీసుకున్న దరఖాస్తులకు చెల్లిచీటి పలుకుతూ తాజాగా మీ సేవలో దరఖాస్తులు స్వీకరించనుంది. మంత్రివర్గ సబ్‌కమిటీ సూచన మేరకు మీసేవలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు స్వీకరించడంతో పాటు కొత్తసభ్యుల చేరిక, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. కాగా ఇది వరకే ప్రజాపాలనలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 81,148 దరఖాస్తులు రాగా.. కామారెడ్డిలో 54,534 దరఖాస్తులు వచ్చాయి. కాగా ఎప్పటి నుంచి దరఖాస్తులు స్వీకరించనన్నారో తేదీ ప్రకటించలేదు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ(ఎం)ను ఆదరించండి

- పార్టీ జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ(ఎం) పార్టీని ఆదరించాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కే చంద్రశేఖర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను ప్రజలు ఆదరించి పార్టీ అభ్యర్థులు పోటీ చేసే అన్ని స్థానాల్లో గెలిపించేలా కార్యకర్తలు ఇప్పటినుంచి కృషి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అవకాశం ఉన్నచోట్ల సర్పంచ్ స్థానాల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ చేయనున్నట్టు తెలపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లాలో పేద, మధ్యతరగతి ప్రజలకు , కార్మికులకు, రైతు కూలీలకు రైతులకు భూమి పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించాలని , పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, యువతకు ఉపాధి కల్పించాలని అనేక సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. హామీల అమలు కోసం, అణగారిన వర్గాల గొంతుకగా నిలిచేందుకు పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం పేద మధ్యతరగతి ప్రజానీకానికి, కార్మిక వర్గానికి, రైతాంగానికి ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోతిరం నాయక్ , కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు ముదం అరుణ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

38 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం సీజ్

నవతెలంగాణ-మెండోరా

పీడీఎస్ బియ్యం 38 క్వింటాళ్లు పట్టుకొని సీజ్ చేసి సివిల్ సప్లై అధికారి కి అప్పగించినట్టు ఎస్ఐ జి.నారాయణ తెలిపారు. జగిత్యాల్ నుండి మహారాష్ట్రకు వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటళ్ల పిడియస్ బియ్యాన్ని పక్క సమాచారంతో కోడిచర్ల గ్రామ సమీపంలో గురువారం రాత్రి పట్టుకుని 38 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేసి సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణ పేర్కొన్నారు.

ఎండుతున్న పంటలు

నీరు లేక.. నెర్రలుబారుతున్న పొలాలు

- చివరి ఆయకట్టుకు అందని నిజాంసాగర్ కాలువ నీళ్లు
- విన్నవించినా పెడచెవిన పెడుతున్న అధికారులు
- ఇంట్లో పడుకుంటే నీళ్లు వస్తాయా అంటూ రైతులపై అవహేళన



కాలువల చివరి ఆయకట్టకు నీరు అందక పంటపొలాలు ఎండుముఖం పడుతున్నాయి. ఒక వైపు ముదురుతున్న ఎండలకు తోడు నీరు లేక పంటపొలాలు నెర్రలు బారుతున్నాయి. ఈ విషయమై అధికారులను కలిసి పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో రైతులు ఆందోళన చేపట్టగా.. రైతులపై అధికారి నోరుపారేసుకున్నట్టు సమాచారం. రైతులు ఇంట్లో పడుకుంటే నీళ్లు వస్తాయా అంటు రైతుల కష్టాన్ని అవహేళన చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా కాలువల మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టుకు నీరు వచ్చేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

-నవతెలంగాణ, నసురుల్లాబాద్

బీర్కూర్ మండలం దామరంచ, కిష్టాపూర్, అన్నారం గ్రామానికి చెందిన రైతులు సాగునీరు అందక వరి పంట ఎండిపోవడంతో రైతులు అధికారుల పనితీరుకు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం మండల సాగునీటి అధికారి గజానందుకు ఫోన్ ద్వారా సమాచారం కోరగా



రైతులు ఇండ్ల పండుకుంటే పంటలు పండుతాయ అంటూ రైతులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు రైతులు ఆరోపిస్తున్నారు. బీర్కూరు మండలం చివరి ఆయకట్టు పంట పొలాలకు నీరు విడుదల చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ నుండి 26వ డిస్ట్రిబ్యూటర్ కాలువ మైలారం మిర్జాపూర్ వీరాపూర్ కొల్లూర్ నాగారం దామరంచ అన్నారం కిష్టాపూర్ తదితర గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రధాన కాలువకు నసురుల్లాబాద్ బీర్కూర్ మండల సాగునీటి అధికారులు ఉండగా నసురు ల్లాబాద్ మండలం మైలారం మీర్జాపూర్ గ్రామ శివారులకు సాగునీరు అందగా, బీర్కూరు మండలం దామరంచ, అన్నారం, కిష్టాపూర్ తదితర గ్రామాలకు చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సాగునీటి అధికారులకు వివరించినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టారు. సాగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడం వలనే చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందడంలో ఆలస్యం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ పంటలు ఎండితున్నాయని రైతులు వాపోతున్నారు. రైతులకు సాగునీరు అందిస్తూ సలహాలు సూచనలు ఇవ్వాల్సిన సాగునీటి అధికారి గజానందు రైతులపై వారికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం ఎంత మట్టుకు సమంజసం అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజానందుపై ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని మండల రైతులు తెలిపారు.

బాన్సువాడ చీఫ్ ఇంజనీర్‌కు ఫిర్యాదు

రైతులపై ఆగ్రహం వ్యక్తం చేయడంపై బీర్కూర్ సాగునీటి అధికారి గజానందు తీరుపై బాన్సువాడ ఎస్ఇ రాజశేఖర్‌కు ఫోన్‌లో వివరణ కోరగా తాను స్థానికంగా లేనని వచ్చిన తర్వాత విషయం ఏమిటో తెలుసుకొని రైతులకు న్యాయం చేస్తానన్నారు. బీర్కూర్ మండలం కిష్టాపూర్, అన్నారం, దామరంచ తదితర గ్రామ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు లేక పంటలు ఎండుతున్న విషయం తెలిసిందన్నారు. కాలువలు మరమ్మతులు చేయించి పిచ్చిమొక్కలు తొలగించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

జాతకాల పేరిట భయబ్రాంతులు

- నలుగురిని పట్టుకొని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



పోలీసుల అదుపులో నలుగురు

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాల్లో జాతకాలు చెప్తామని అపరిచిత వ్యక్తులు సంచరించడంతో వారి కదలికలపై అనుమానం కలిగిన గ్రామస్తులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన లింగంపేట్ మండలంలోని కోమటిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాజన్న జిల్లా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కోమటిపల్లి గ్రామంలో సంచరిస్తూ మీ ఇంటికి వాస్తు బాగోలేదని, మీ కొడుకులు మృత్యువాత పడతారని దానికి విరుగుడుగా తాయితీలు కట్టుకోవాలని లేకపోతే మీ కుమారులు చనిపోతారని ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులను గ్రామస్తులను భయబ్రాంతులను గురి చేశారు. ఆగ్రహించిన గ్రామస్తులు వారిని పట్టుకుని పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని దేహ శుద్ధి చేసి లింగంపేట్ పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వారిని అదుపులో తీసుకుని విచారిస్తున్నామని లింగంపేట ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు. జాతకం, మంత్రాల పేరుతో గ్రామాల్లో మూఢవిశ్వాసాలను ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. జాతకం చెప్తామని గ్రామాల్లోకి వచ్చే వారితో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలి

- మార్కులే కాకుండా సామాజిక పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- హెచ్‌ఎంల సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. అప్పుడే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసి, ఉపాధ్యాయ వృత్తికి సార్థకత చేకూర్చిన వారవుతారని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మీటింగ్ హాల్ లో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై కలెక్టర్ వారికి దిశా నిర్దేశం చేశారు. మార్కులు, గ్రేడ్ పాయింట్లు ప్రామాణికం కాకుండా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని అన్నారు. ప్రతి విద్యార్థికి సామాజిక పరిస్థితులపై చక్కటి అవగాహన కల్పిస్తూ, ఇష్టపడి చదువుకోవాలనే కోరికను వారిలో పెంపొందించాలన్నారు. ప్రాథమిక దశ నుండే విద్యార్థులలో చదువు పట్ల శ్రద్ధను కలిగిస్తే, వారు ఏకాగ్రతతో విద్యను నేర్చుకుని సత్ఫలితాలు సాధించగలుగుతారని తెలిపారు.

పాఠశాలలోని ప్రతి విద్యార్థిని తమ కన్న బిడ్డలుగానే భావిస్తూ, వారికి నాణ్యమైన విద్యను అందించి భావి జీవితానికి మార్గనిర్దేశకులుగా మారాలని పిలుపునిచ్చారు. బడులలో ప్రభుత్వ పరంగా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని, ఈ దిశగా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయని, ప్రభుత్వం నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తోందని గుర్తు చేశారు. అయితే విద్యా బోధన సక్రమంగా లేకపోతే మౌలిక వసతులు, ఇతర సదుపాయాల కోసం ఎన్ని కోట్ల రూపాయల నిధులు వెచ్చించిన ప్రయోజనం ఉండదని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరు బోధనపరమైన విధులను అంకితభావం, చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపించిన దృష్ట్యా, ప్రణాళికాబద్ధంగా బోధన చేస్తూ సిలబస్ ను పూర్తి చేయాలన్నారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో తానూ ఆయా పాఠశాలలను తనిఖీ చేసిన సందర్భంలో అనేక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించినప్పుడు విద్యా ప్రమాణాలు సంతృప్తికరంగా కనిపించలేదని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యార్థులు పాస్ మార్కులతో ఉత్తీర్ణులు అయితే చాలు అనే భావన ఎంతమాత్రం సరికాదని, దీనివల్ల ఉన్నత విద్యాభ్యాసంలో విద్యార్థులు వెనుక బడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు మెరుగైన విద్యను బోధిస్తే, వారి ఆలోచనా దృక్పథం, సృజనాత్మకత పెంపొందుతుందని సూచించారు.

డీఎస్సీ ద్వారా కొత్తగా ఉపాధ్యాయుల నియామకాలు జరిగినందున దాదాపుగా అన్ని పాఠశాలల్లో టీచర్ల ఖాళీలు భర్తీ అయ్యాయని, సమయపాలనను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంపై దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ హితవు పలికారు. పరీక్షలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సమయం ఏమాత్రం వృధా కాకుండా విద్యార్థులకు పునశ్చరణ జరిపించాలని, చక్కటి వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునే ప్రోత్సహిస్తూ, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా అపార్ ఐ.డీలు జనరేట్ చేయడంలో ముందంజలో నిలిచిన ఐదుగురు హెచ్.ఎం లను, ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఐదుగురు కాంప్లెక్స్ పాఠశాలల హెచ్.ఎంలను కలెక్టర్ సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, పరీక్షల నియంత్రణ విభాగం అధికారి విజయభాస్కర్, ఎం.ఈ.లు, హెచ్.ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల 'పాదయాత్ర'

- మేత కోసం సుదూర ప్రాంతాలకు పయణం



నవతెలంగాణ-తాడ్వాయి

పశుగ్రాసం కోసం పశువులు సుదూర ప్రాంతాలకు పయణం అవుతున్నాయి. ప్రస్తుతం వేసవి సమీపిస్తున్న తరుణంలో.. స్థానికంగా పశువులకు గ్రాసం లేకపోవడంతో పశు కాపరులు.. వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తు న్నారు. తాడ్వాయి మండలంలో వర్షధార పంటలు సాగవుతుండటంతో పశుగ్రాసంపై తీవ్ర ప్రభావం పడ్డది. మొక్కజొన్న సాగుచేసిన సమయంలో మాత్రమే మూగజీవాలకు అందినంత పశుగ్రాసం లభిస్తుంది. పంటలు వెయ్యని సమయంలో ఎడారిని తలపిస్తున్నాయి. గ్రామ శివారులో అడవి ప్రాంతంలోకి మూగజీవాలను పచ్చి గడ్డి కోసం తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి రాయితీ పశుగ్రాసం అందిస్తే రైతులతో పటు మూగజీవాల వేదన తీరుతుంది. చాలామంది రైతులు పశుగ్రాసం దొరకపోవడంతో తాత్కాలిక ఏర్పాట్ల చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనితో వాటి నిర్వహణ సైతం రైతులకు భారంగా మారింది. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మూగజీవాల యజమానులు కోరుతున్నారు. సుమారు 40-50 కిలో మీటర్‌ల ప్రయాణం చేస్తేనే పశువులకు గ్రాసం అందుతున్న పరిస్థితి నెలకొంది.

సబ్సిడీతో ఇవ్వాలి

గోల్కొండ రాజయ్య, తాడ్వాయి



పశుగ్రాసం సబ్సిడీతో ఇవ్వాలి. ప్రస్తుతం గడ్డి అందుబాటులో లేకపోవడంతో మూగజీవాలను సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి రాయితీలు కల్పిస్తే.. ఎక్కడికి వెళ్లకుండా స్థానికంగా ఉండి పశువులను పెంచుకుంటాం

ప్రతిపక్ష నాయకుల ఇసుక బండ్లు ఆపకుండా మా బండ్లు ఆపుతావా..?

- బోధన్ రూరల్ ఎస్ఐపై కాంగ్రెస్ నాయకుడి చిందులు
- మేము తలుచుకుంటే ఒక్క సెకను కూడా ఉండలేవ్ అంటూ కాంగ్రెస్ నాయకుడి వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్

నవతెలంగాణ-బోధన్

'ప్రతిపక్ష నాయకుల ఇసుక ట్రాక్టర్‌లు ఆపకుండా మావి ఆపుతావా..? మేము తలుచు కుంటే ఒక్క సెకండ్ కూడా ఇక్కడ ఉండలేవు ఖబర్దార్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి' అని సాలూర మండల కాంగ్రెస్ నాయకులు బిహారి అనే వ్యక్తి బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. '10 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతూ బండ్లు అమ్ముకుని రోడ్డున పడ్డానని, పార్టీ కోసం కష్టపడ్డానని తన పేరు బద్నాం చేస్తూ వాడు తాగుబోతూ అంటు మా సార్ దగ్గర నాపై అసత్య ప్రచారం చేయడం, వాడికి సినిమా చూపిస్తా అంటు మా సార్ దగ్గర అబద్ధం చెప్పినవు, ఏం చేస్తావ్ సార్ మొన్న మొన్న వచ్చినావ్ మేము తలుచుకుంటే ఒక్క సెకండ్ కూడా ఇక్కడ ఉండలేవు ఖబర్దార్ మచ్చేందర్ రెడ్డి' అంటూ వీడియోలో హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల టిప్పర్లు వదులుతున్న ఆ సంగతి తెలుసంటూ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బిహారి

ఈ విషయమై కాంగ్రెస్ నాయకుడిని వివరణ కోరగా తనకు ఎస్ఐ పెట్టిన ఇబ్బందుల కారణంగా తాను అలా మాట్లాడవలసి వచ్చిందని వివరణ ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌కి వెళ్తే కనీసం మర్యాద లేకుండా వల్గర్ గా మాట్లాడారని పేర్కొ న్నారు. ఇదే విషయమై బోధన రూరల్ ఎస్సైని వివరణ కోరగా ఆయన నిన్న స్టేషన్‌కు రాలేదని ఆయన చెప్పే మాటలు అసత్యమని కొట్టిపారేశారు. ఎవరి వాహనాలు పట్టుకున్న ఎవరికి ఏం రాయాలో అది రాశామని తెలిపారు. బోధన్ మండలంలో గత కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయవలసిన అధికారులు అక్రమార్కులకు అండగా ఉంటున్నారని అంతట విమర్శలు వస్తున్నాయి. ఇదే క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోలీసుల తీరుపై విమర్శించిన వీడియో ప్రస్తుతం బోధన్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

దీర్ఘకాలిక రుణాల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఉపయోగించుకోవాలి



నవతెలంగాణ-మద్నూర్

దీర్ఘకాలిక రుణాల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను ఉపయోగించుకోవాలని మద్నూర్ సింగిల్ విండో కార్యదర్శి జె బాబుపటేల్ సదరు రైతులకు సూచించారు. సింగిల్ విండో పరిధిలో ఎల్టీ మార్టిగేజ్ రుణాలు తీసుకున్న 92 మంది రైతులకు గాను రూ.5.50 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఈ రుణాలకు గాను ప్రభుత్వం మార్చి చివరి నాటికి ఓటీఎస్ ద్వారా చెల్లించుకోవడానికి అవకాశం ఇచ్చిన దానిని రుణ బకాయిదారులు ఒకేసారి చెల్లించుకుని బకాయిలో తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయని ఇలాంటి అవకాశం ఎప్పుడూ రాదని ఈ మార్చి చివరినాటికి ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. పెద్ద మొత్తంలో గల బకాయిని ఒకేసారి చెల్లించుకునే అవకాశం కల్పించినందున రుణాలు పొందిన రైతులంతా బకాయిలు కొంత తగ్గించుకునే అవకాశం ఉన్నందున బకాయి దారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

పోలీసు క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలి

పతకాలు సాధించిన పోలీస్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-కామారెడ్డి

3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025 లో పతకాలు సాధించిన జిల్లా పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సింధు శర్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. కరీంనగర్‌లో జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు జరిగిన 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2025 క్రీడల్లో జిల్లాకి చెందిన క్రీడాకారులు 02 బంగారు పతకాలు, 05 -రజిత, 03-కాంస్యం పతకం సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు జిల్లా ఎస్పీని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తిమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించినందుకు ముందుగా క్రీడాకారులకు అభినందనలు లియజేసి బహుమాతులను అందజేశారు. ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పథకాలు సాధించిన వారిలో తిరుపతి, బాలరాజ్ కె అంకుష్ ఎస్ హరిచంద్ రాజేష్ పి ప్రవీణ్ ప్రభు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పి యాకూబ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి ఇంచార్జి ఎంఈఓగా రాజాగౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి


ఎంఈఓను సన్మానిస్తున్న నాయకులు

ఎడపల్లి మండల ఇన్చార్జి విద్యాశాఖ అధికారిగా కట్ట అంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు టిఎస్ సంఘం బాధ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి సాయిలు, పిఆర్‌టియు మండల అధ్యక్షులు సిహెచ్ సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, అసోసియేట్ మండలాధ్యక్షులు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బాలేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరావు, సీనియర్ ఉపాధ్యాయులు దత్తాత్రి, శ్రీనివాసరెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవికుమార్, పిఆర్‌టియు రెంజల్ మండల ప్రధాన కార్యదర్శి ఏనుగు కిషోర్ కుమార్, నాందేవ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయానికి సౌండ్ సెట్ వితరణ

నవతెలంగాణ-బాల్కొండ


దంపతులను సన్మానిస్తున్న పలువురు

మండల కేంద్రంలోని శ్రీ నిమిషాంబ దేవి ఆలయానికి గంటగంటకు అలరం మోగే దేవి శ్లోకాల సౌండ్‌సెట్ యంత్రాన్ని శుక్రవారం కుందారపు శిరీష శ్రీనివాస్ దంపతులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ రావు, గంగాధర్, రవికిరణ్, జగన్ ,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

- 11 మందికి జరిమానా


జైలుశిక్ష పడిన బాధితులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో న్యాయస్థానం ఆరుగురికి జైలు శిక్ష, 11 మందికి 15,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీ సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 17 మంది పట్టుబడగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చి న్యాయస్థానంలో హాజరుపర్చారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ 11 మందికి మొత్తం రూ.15,500 జరిమానా విధించారని, అలాగే ఖానాపూర్‌కు చెందిన టి.సంతోష్, షేక్ సైద్, మిట్టపల్లికి చెందిన అనిల్, గౌతమ్‌నగర్‌కు చెందిన విఠోబా, డిచ్‌పల్లికి చెందిన షేక్ ఇమామ్‌కు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సూచించారు.

ఏర్గట్లలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయని ఆలయ ప్రధానార్చకులు ధరూరి రజినీకాంతాచార్యులు తెలిపారు. 10వ తేదీ సోమవారం లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణం, 12న బుధవారం రాత్రి 9:09 నిమిషాలకు రథోత్సవం, జాతర, 13న గురువారం అన్నప్రసాదం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


నిల్వనీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-ఆర్మూర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈఓ రవి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ రవి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాలలో కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, పాత కుండలు, పనికిరాని వస్తువులను ఉంచుకోవద్దని.. దానిలో వర్షపు నీరు పడి దోమల లార్వా వృద్ధి చెంది డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. దోమ పుట్టుక గురించి, దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఆశా కార్యకర్తలు మమత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వ సాధన కోసం సీఎం కృషి

- మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అక్బర్



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలో సామాజిక సమానత్వ సాధన కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని మైనార్టీ సెల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సైకిల్ టెక్ అక్బర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సేకరించిన అధికారిక కులగణన నివేదిక బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి ఆధార భూమికాగా నిల్వగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. బడుగు బలహీనులకు ప్రభుత్వ ఫలాలు అందించడానికి సమగ్ర వివరాలతో కూడుకున్న కులగణలో అన్నీ కులాల వారిని లెక్కించి బీసీలకు, ఎస్సీలకు వారి వారి జనాభా ఎంత ఉందో నివేదిక సేకరణ చారిత్రకమైనది చెప్పారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరంగా ఉన్నవారిని చేరదీసి వారికి ప్రభుత్వ పరంగా తగిన చేయూతను అందివ్వడానికి ప్రభుత్వం సేకరించిన నివేదిక ఆదర్శవంతమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహా కుంభమేళాకు బయలుదేరిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు

నవతెలంగాణ-ఆర్మూర్

144 సంవత్సరాలకొకసారి వచ్చే మహా కుంభమేళాను పురస్కరించుకొని శుక్రవారం పట్టణ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా కుంభమేళాకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్
బకాయిల విడుదలకు కృషి చేయాలి

- ఉమ్మడి జిల్లాల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నపం


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు కృషి చేయాలని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాల ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల యాజమాన్యం బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలో సుదర్శన్‌రెడ్డిని వారి నివాసంలో ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల బృందం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల కాకపోవడంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారిందని, కాలేజీల యాజమాన్యాలు సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. వేల మంది విద్యార్థులు ఉచితంగా చదువుకుంటున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో అటు విద్యార్థులు ఇటు కళాశాలల సిబ్బంది చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత సంవత్సర కాలం నుంచి సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. భవనాల అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. కళాశాల యాజమాన్యాల నుండి సమాచారం తెలుసుకున్న సుదర్శన్‌రెడ్డి చాలా సానుకూలంగా స్పందించారని కళాశాలల యాజమాన్యం అన్నారు. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఒక వారం పది రోజుల్లో బకాయిలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కళాశాలల విద్యార్థులు, యాజమాన్యాలు సిబ్బంది రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్, కార్యదర్శి సంజీవ్, మారయ్యగౌడ్, నిశిత రాజు, సూర్యప్రకాష్, శంకర్, జైపాల్‌రెడ్డి, నరాల సుధాకర్, గిరి, దత్తు, శ్రీనివాస్, రషీద్, రమణ, వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో, ట్రెయిన్లలో
దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలి

- ప్రయాణికులు క్షేమంగా గమ్యానికి చేరుకునేలా చూడాలి
- రైల్వే సిబ్బందికి సూచించిన రైల్వే డిఎస్పి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న రైల్వే డిఎస్పి శ్రీనివాస్ రావు

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో, ట్రెయిన్లలో దొంగతనాలను జరగకుండా చూడాలని, దొంగతనాల నివారణకు రైల్వే పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని హైదరాబాద్ రైల్వే డి.ఎస్.పి శ్రీనివాస్‌రావు సూచించారు. శుక్రవారం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్లో వార్షిక తనిఖీలలో భాగంగా రైల్వే డిఎస్పి కె.శ్రీనివాస్‌రావు హైదరాబాద్, ఏ.శ్రీనివాస్ సి.ఐ హైదరాబాద్ నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడి ట్రెన్లలో దొంగతనాలు జరగకుండా ప్రయాణికులు క్షేమంగా గమ్యానికి చేరుకునేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైల్వే స్టేషన్‌లో నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రైల్వే పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరు హాజరయ్యారు.

కుక్కలు పట్టివేత.. ఏబీసీ సెంటర్‌కు తరలింపు

- నవతెలంగాణ వార్తకు స్పందన


కుక్కలు పడుతున్న మున్సిపల్ సిబ్బంది

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో పలుచోట్ల కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలించినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. కుక్కలు, కోతుల బెడద అనే శీర్షికన శుక్రవారం నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని పలుచోట్ల వీధి కుక్కలను పట్టుకొని ఏబిసి సెంటర్‌కు తరలిస్తున్నామని చెప్పారు. వీధి కుక్కలకు ఎలాంటి హానీ కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ తర్వాత పట్టుకున్న చోటే వీధి కుక్కలను వదిలిపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూజిసి ముసాయిదాను వ్యతిరేకిస్తున్నాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



లేఖను అందజేస్తున్న నాయకులు

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా, రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా కొత్తగా తయారుచేసిన యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. యుజిసి ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని గవర్నర్ (యూనివర్సిటీ ఛాన్సలర్)కు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి ద్వారా లేఖను పి.డి ఎస్.యూ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలను కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి నూతనంగా యూజీసీలో కొత్తగా నిబంధనలను తీసుకువచ్చారని, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని మేం కోరుకుంటున్నామని, యూజీసీ నిధులు యూనివర్సిటీల అభివృద్ధికి గత కొంతకాలంగా విడుదల చేయడం లేదని, యూనివర్సిటీలకు యూజీసీ ద్వారా నిధులు కేటాయించాలని అన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న యూనివర్సిటీలలో కేంద్రం పెత్తనం చేయడానికి కుట్రలు పన్నుతోందని, పారిశ్రామికవేత్తలను, తమ భావజాలానికి అనుకూలంగా ఉండే వారిని వైస్ ఛాన్సలర్‌లను నియమించడానికి సవరణలు చేస్తున్నారని, వైస్ ఛాన్సలర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు ప్రొఫెసర్ల ప్రస్తుత నియామక అర్హతలు కొనసాగించాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం యూజీసిలో తమ అనుకూల విధానాలను విద్యలో ప్రవేశపెడుతున్నారని అన్నారు. యూనివర్సిటీల పీహెచ్డీ ప్రవేశాలలో సెట్, నెట్‌లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే నూతనంగా తీసుకువచ్చిన యూజీసీ నిబంధనలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ నాయకులు ప్రిన్స్, దేవిక, అక్షయ్, రాకేష్, హుస్సేన్, రోహిత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని నిజామాబాద్ ఒకటవ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి శుక్రవారం తెలిపారు. ఎస్‌హెచ్ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 2వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ముస్కాన్ కలెక్షన్స్ ముందు శంభునిగుడి దగ్గర ఒక గుర్తు వృద్ధురాలు (55 నుంచి 60 సంవత్సరాలు) పసుపు కలర్ స్వెటర్, ఎరుపు రంగు చీర ధరించింది. అపస్మారక స్థితిలో ఉన్నందున 108 అంబులెన్స్ ద్వారా గవర్నమెంట్ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించారు. వృద్ధురాలు చికిత్స పొందుతూ ఫిబ్రవరి 6వ తేదీన 11:30 నిమిషాలకు మృతిచెందింది. బిక్షాటన చేసుకునే వృద్ధురాలుగా మృతురాలిని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమెకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ 8712659714 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పేలిన ఆటోకు బదులు మరో ఆటో ఇవ్వాలి

- తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలి
- బాధితుడి డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు

పేలిన ఆటోకు బదులు మరో ఆటో ఇవ్వాలి, అలాగే ఆటో పేలినందుకు గానూ తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని బాధితుడు డిమాండ్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నగరంలోని ధర్మపురి హిల్స్‌కు చెందిన ఒక నిరుద్యోగ యువకుడు ఫైనాన్స్ తీసుకొని మహేంద్ర కంపెనీ బ్యాటరీ ఆటోను జనవరి 15న కొన్నాడు. ఈ నెల 6న ఉదయం చార్జింగ్ పెట్టి పైకి వెళ్ళాడు. పేలుడు శబ్దం విని కిందికి వచ్చాడు. ఆటో పేలి మంటలు చెలిరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆటో మొత్తం దగ్ధమైంది. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. కంపెనీవారు ఇలాంటివి తయారు చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు పరీక్షించి బయటకు విడుదల చేయాలని, ఆటో ఇంటిలో గ్రౌండ్ ఫ్లోర్లో పేలడంతో పెను ప్రమాదం తప్పిందని.. అదే రోడ్డు మీద ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు పేలి ఉంటే ఎన్ని ప్రాణాలు గాలిలో కలిసేవోనని ఆందోళన వ్యక్తం చేశాడు.

ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, బి.భూమన్న, తెలంగాణ వెజిటబుల్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం శివ కుమార్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కోసం ఆటో తీసుకున్న సదరు యువకుడికి కొత్త ఆటోను తక్షణమే కేటాయించాలని, ఇల్లు కాలినందున మంటలు ఆర్పే ప్రయత్నం చేసినవారికి గాయాలైనందున మానసిక వేదనకు సంబంధిత యువకుడు కుటుంబానికి తగిన పరిహారాన్ని యాజమాన్యం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

నాగేంద్రనగర్ గ్రామంలో దొంగల బీభత్సం

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంటి తాళాన్ని పగులగొట్టి నగదును దోచుకుని పారిపోయారు. ఏర్గట్ల ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం వేకువజామున నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన జంగం ముత్తెన్న ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలో అతను దాచుకున్న ఒక ప్రదానపు ఉంగరం, తన చిన్న బాబుకు చెందిన రెండు వెండి కడియాలు, 1000 రూపాయల నగదును దోచుకెళ్ళినట్లు తెలిపారు. జంగం ముత్తెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదల వైద్యానికి భరోసా


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముఖ్యమంత్రి సహాయనిధితో పేద, మధ్యతరగతి ప్రజల వైద్యానికి ఎంతో భరోసా లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్ముల రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్లూర్‌లో ముగ్గురు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రెంజర్ల భారతి, ఆకుల సునీత, పూజారి లక్ష్మికి ప్రభుత్వం సుమారు రూ.90వేల విలువైన చెక్కులను ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ సహకారంతో మంజూరు చేసింది. ఆ ఆర్థిక సహాయం చెక్కులను లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా కొమ్ముల రవీందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ కృషితో ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయం చెక్కులను మంజూరు చేసిందన్నారు. ఆర్థిక సహాయం చెక్కుల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అవారి సత్యం, సుంకరి విజయకుమార్, మారుపాక నరేష్, ఏనేడ్ల గంగారెడ్డి, రాజేశ్వర్, శేఖర్ పాల్గొన్నారు.

రేపు వసంత జ్యోతి హాస్పిటల్‌లో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

నవతెలంగాణ-ఆర్మూర్



హైదరాబాద్‌లోని ఇందిరా ఐవీఎఫ్ హాస్పిటల్ లిమిటెడ్ వారు రేపు ఆదివారం వసంత జ్యోతి హాస్పిటల్‌లో ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వైద్యురాలు డాక్టర్ జి.వసంతకుమారి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని విజయ పబ్లిక్ స్కూల్ హైస్కూల్ గ్రౌండ్ పక్కన గల హాస్పిటల్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 9166111901 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని అంచనూర్ గ్రామంలోని నర్సరీలను ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని నర్సరీల్లో ,బెడ్ లలో మొక్కలను పరిశీలించి వాటిని సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్ లో మొక్కలు పరిశీలించారు. రోడ్ల వెంబడి మొక్కలను పాదులు తీసి, ట్రి గార్డులను ఎర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ రజనీ, టీఏలు లింగం , రాజేశ్వర్ పంచాయతీ కార్యదర్శులు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాగునీటి ఎద్దడికి ముందస్తు జాగ్రత్తలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఆయా గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో తిరుపతిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పోసానిపేటలో వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండనునందున ముందస్తు జాగ్రత్తగా రైతుల బోరు బావుల నుండి సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి, మిషన్ భగీరథ సూపర్వైజర్ స్వామి, గ్రామస్తులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, గోగూరు రాజిరెడ్డి, కారోబా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

బీజేపీ మండలాధ్యక్షునిగా టీ తుకారాం

నవతెలంగాణ-మద్నూర్

బీజేపీ మద్నూర్ మండల అధ్యక్షులుగా తెప్ప తుకారాం రెండోసారి రెండోసారి ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మరోసారి అవకాశం కల్పించినందుకు జహీరాబాద్ మాజీ ఎంపీ పాటిల్ కు జుక్కల్ మాజీ ఎమ్మెల్యేకు, బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు సూచించారు.

బోరు మోటర్ చోరీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కంచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటర్ ను గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న పరిశీలించగా బోరు మోటర్ దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి



మండల కేంద్రమైన తాడ్వాయిలో శుక్రవారం సిసి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. బీసీ కాలనీలో గతంలో నుండి రోడ్డు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి కాంగ్రెస్ కార్యకర్తలు దృష్టికి తీసుకెళ్లగా డ్రైనేజీ మురికి కాలువల నిర్మాణానికి గారు 20 లక్షల నిధులు మంజూరయ్యాయని మండల కేంద్రంలో నీ పలు కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష లు జూకంటి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, గ్రామ అధ్యక్షులు మెట్టు రామచంద్రం, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు తదితరులు తెలిపారు.

నమూన ఓటింగ్‌పై అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నమూనా ఓటింగ్ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమం వలన పిల్లల్లో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఎన్నికలు ఓటు విలువ, రాజకీయ పార్టీలు తదితర అంశాలు తెలుసుకోగలిగారని అన్నారు. పోలింగ్ ఆఫీసర్స్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ పార్టీ ఏజెంట్స్‌గా ఎవరుంటారు పోలింగ్ బూత్ ఏర్పాట్లకి సంబంధించిన విషయాలు వివరంచినట్టు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి శుక్రవారం తెలిపారు.

తాడ్వాయిలో 25,922 మంది ఓటర్లు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా 25,922 మంది ఓటర్లు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 13,686 మంది మహిళలు కాగా, 12,236 పురుష ఓటర్లు ఉన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తం మండలంలోని 18 గ్రామాల్లో వార్డుల వారిగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.ఔ

సమస్యల సాధనకై చలో ఢిల్లీ

నవతెలంగాణ-రామారెడ్డి

భారతీయ జీవిత బీమా లో ఏప్రిల్ 1 నుండి ఐఆర్డిఏ తీసుకొస్తున్న మార్పులతో ఎల్ఐసి ఏజెంట్ మనుగడ కష్టంగా ఉంటుందని లియఫి జాతీయ నాయకులు కిషోర్ చంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి ఏటీసీ హాల్లో ఏజెంట్ల సమైక్య సమావేశాన్ని శుక్రవారం బ్రాంచ్ అధ్యక్షులు కదం నారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఐఆర్డిఏ తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ఏజెంట్ల జేఏసీ ఆధ్వర్యంలో మార్చి 19వ తేదీన దేశవ్యాప్తంగా ఉన్న ఏజెంట్లు ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతి ఏజెంట్ పాల్గొని ఏజెంట్ల సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొండ భైరయ్య, ఉమాపతి, ప్రదీప్ జైన్, రామ్ శెట్టి శేఖర్, యాదవ రెడ్డి, శ్యామ్ రావు, సంతోష్, తదితరులు ఉన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా ఈవీఎం గోదామ్‌ను సందర్శించినట్టు తెలిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, గోదాములో భద్రపరచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును సి.సి.టివి ద్వారా తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, కామారెడ్డి తహసీల్దార్ జనార్ధన్ ,ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, నాయబ్ తహసీల్దార్ అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో చెట్లు నరికిన వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని రాంపూర్ గడ్డ గ్రామంలో కొన్ని సంవత్సరాల క్రితం పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను నాటగా, కొన్ని రోజుల క్రితం దాదాపు 30 చెట్లు కొట్టేసి ఉండగా విచారణ చేపట్టిన అధికారులు.. అదే గ్రామానికి చెందిన పిట్ల రామయ్యపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం తెలిపారు. రాంపూర్ గడ్డ గ్రామపంచాయతీ సెక్రెటరీ అయిన స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ కు శుక్రవారం ఆర్టిఐ జిల్లా ప్రతినిధి రవీందర్ వినతి పత్రాన్ని అందజేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ కేంద్రంలో నీటి సమస్య పరిష్కారం కొరకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగరాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా వనదుర్గ పెద్దమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ వనదుర్గ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు ఉత్సవాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బియ్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

జవహర్ నవోదయ విద్యాలయం వచ్చే విద్యా సంవత్సరానికి 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఎంట్రెన్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రేపు (8-2-2025) జరుగనున్న ఎంట్రెన్స్ పరీక్షకు పూర్తి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇంటర్మీడియట్ కోర్సుకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1-30 వరకు, తొమ్మిదవ తరగతి కోర్సుకు ఉదయం గం.11-15 నుండి గం.1-45 నీ. వరకు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ ఎంట్రెన్స్ నిర్వహణకు 14 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. 13 కేంద్రాలు కామారెడ్డిలో ఒక కేంద్రం నిజాంసాగర్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు 9వ తరగతి పరీక్షకు 1739 మంది, ఇంటర్మీడియట్‌కు 2103 మంది విద్యార్థులకు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్రాల వద్ద 144 (163 బిఎన్ఎస్) సెక్షన్ విధించాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని అవసరమైన మందులతో నియమించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు తెలిపారు. పరీక్ష సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.చంద్ర శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, తహసీల్దార్ జనార్ధన్, కామారెడ్డి మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

10న చలో ఇందిరా పార్క్

- బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన : సీఐటీయూ

నవతెలంగాణ-బాన్సువాడ(కామారెడ్డి)

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీనా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు రవీందర్ పిలుపు నిచ్చారు. బాన్సువాడ పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో మున్సిపల్ కార్మికులు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు, అంగన్వాడీలు, గ్రామపంచాయతీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

బడ్జెట్‌లో తెలంగాణకు బిజెపి పార్టీ తీవ్ర ద్రోహం చేసిందన్నారు. బిజెపికి తెలంగాణ నుండి ఎనిమిది మంది ఎంపీలు, అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నారు. తెలంగాణ గురించి మాట్లాడకపోవడం చాలా సిగ్గుచేటు బీజేపీ ఎంపీ మాట్లాడి తెలంగాణకు బడ్జెట్లో వాటా తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బుజ్జి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు



చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు రమా బాయ్ అంబేద్కర్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సురేష్ గొండ మాట్లాడుతూ అంబేద్కర్ ఉన్నత విద్య అభ్యసనలకు ప్రోత్సహించిన మహా త్యాగశీలి రమాబాయి అంబేద్కర్ అని, అనేక కూలి పనులకు వెళ్లి అనేక కష్టాలు అనుభవించి డబ్బులు సంపాదించి అంబేద్కర్‌ను చదువులకు పంపించిన ఆదర్శమూర్తి అని కొనియాడారు. కుటుంబంలో అనేక ఇబ్బందులు తినడానికి తిండి లేకపోయినా, పిల్లలు రోగాల బారిన పడినా.. పని చేస్తూ ఇటు కుటుంబాన్ని, అటు అంబేద్కర్ చదువులకు ప్రోత్సహించిన త్యాగశీలని అని గుర్తుచేశారు. కార్యక్రమంలో సి.హెచ్ గంగారం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, మండల అధ్యక్షులు షైక్ ఫిర్దోస్, నాయకులు రాహుల్, మహేష్, అఫ్రూస్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కంబ్లే కిషన్, నాయకులు, గజానంద్, సాయినాథ్,భాను ప్రసాద్, సునీల్,అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల రికార్డులు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అంతంపల్లి, భిక్కనూర్, పెద్ద మల్లారెడ్డి, బస్వాపూర్ గ్రామాలలోని సొసైటీ కేంద్రాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా సొసైటీలోని ఎరువుల రికార్డులను పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా సొసైటీలలో ఎరువులు, విత్తనాలు అందించాలని సీఈఓలకు తెలియజేశారు. కార్యాలయాల రికార్డులు, వివరాలు పరిశీలించి ఈపాస్ మెషిన్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ అపర్ణ, ఏవో శోభ, ఆయా గ్రామాల ఏఈవోలు, సొసైటీ సీఈవోలు, తదితరులు ఉన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న నర్సరీని ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి శుక్రవారం మొక్కలను పరిశీలించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని నర్సరీ లోని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జాతీయ ఉత్తమ సేవా పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక

నవతెలంగాణ-కామారెడ్డి

జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈ ఆదివారం నిర్వహిస్తున్న శ్రీ సాయి సేవా భగవాన్ జాతీయ ఉత్తమ సేవా పురస్కారానికి కామారెడ్డి రక్తదాతల సమూహ ఫౌండర్, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు ఎంపిక అయినట్టు తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు మెగా రక్తదాన శిబిరాల నిర్వహణ,వ్యక్తిగతంగా 75 సార్లు రక్తదానం,ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తున్నందుకుగాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు బాలు తెలిపారు.

మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రహ్మాజీ వాడి గ్రామంలో శుక్రవారం మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్లు ప్రతిష్టాపనకు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యకర్తలు కలిసిమెలిసి ఉండాలని గ్రామంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో అరికెల ప్రభాకర్ యాదవ్ మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, దమ్మన్న సాయి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యూసెన్స్ చేసిన చేసిన ఇద్దరు బైండోవర్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామానికి చెందిన వడ్డే వార్ గజానంన్, అవార్ వార్ గంగాధర్ అనే ఇద్దరు వ్యక్తులు అతిగ మద్యం తాగి డయల్ 100కు ఫోన్ చేస్తూ న్యూసెన్స్ చేయడంతో వారిద్దరిని మద్నూర్ తహసీల్దార్ ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్టు ఎస్ఐ విజయ్‌కొండ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

పట్టుభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి.. శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరారు. గెలుపు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, సౌజన్య తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి, ర్యాగట్లపల్లి ఆయా గ్రామాలలో పంచాయతీ సిబ్బంది చేత పారిశుధ్య పనులు, విద్యుత్ దీపాలు, నీటి కులాయిలా సమస్యలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇంటి పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, నీటి సమస్య ఉంటే గ్రామ పంచాయతీలో తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పంటల వివరాలు ఆన్ లైన్‌లో నమోదు

నవతెలంగాణ- రాజంపేట్ (భిక్కనూర్)

రాజంపేట్ పట్టణ కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఈఓ శిల్ప మాట్లాడుతూ గ్రామంలో రైతులు పండిస్తున్న యాసంగి పంటలు వివరాలు డిసిఎస్ యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని రైతులు అందుబాటులో ఉండి పంటల వివరాలు నమోదు చేయడానికి వ్యవసాయ అధికారులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు ఉన్నారు.

మోడల్‌కు ముగ్గు పోశారు నిర్మాణం ఎప్పుడో..?



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ ఇళ్లకు మోడల్ ఇల్లుకు ముగ్గు పోశారు. మోడల్ ఇల్లు నిర్మాణం ఎప్పుడు అని పలువురు మండల వాసులు చర్చించుకుంటున్నారు. మోడల్ ఇల్లు నిర్మాణమే ప్రారంభం కాలేదు గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు ఎప్పుడు ప్రారంభిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తే ప్రతి గ్రామాల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తారని నమ్మకము ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మోడల్ ఇల్లు నిర్మించి గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రయివేటు ఆస్పత్రుల్లో తనిఖీ చేపట్టి నకిలీ వైద్యులను గుర్తించాలి

- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్



మాట్లాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం సభ్యులు

నవతెలంగాణ-గాంధారి

జిల్లా, మండల కేంద్రాల్లో వెలుస్తున్న ప్రయివేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టి నకిలీ వైద్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్లో ఎంబీబీఎస్ డాక్టర్‌గా నకిలీ వైద్యులు చలామణి అవుతూ వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఇటీవల ఓ నకిలీ డాక్టర్ పట్టుబడ్డట్టు తెలిపారు. అయినా.. రోజురోజుకూ జిల్లా, మండల స్థాయిలో ప్రయివేటు ఆస్పత్రులు పుట్టుకొస్తున్నట్టు తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నకిలీ డాక్టర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లల్లో పోషణ లోపం తగ్గించాలి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఇందిరా గాంధీ పథకం కార్యాలయం శుక్రవారం పిల్లల్లో పోషణ లోపం తగ్గించడంపై గ్రామ సంఘాల సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి జగదీష్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల్లో పోషిక లోపంతో శారీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీన పడుతుందని తెలిపారు. పిల్లల్లో పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్య, పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించవచ్చు అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్ఐఆర్‌డిపిఆర్, యూనిసెఫ్, సెర్ప్ సంస్థలు కలిసి ఎస్ సి జి మహిళలు వారి కుటుంబాల కోసం ఒక ప్రత్యేకమైన శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపియం శ్రీనివాస్, సీసీ మెహర్ కుమార్, సీసీలు, విఓఏలు, యం యస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న బిజెపి నాయకులు

నవతెలంగాణ-నిజాంసాగర్

కామారెడ్డి జిల్లాకు ఇటీవలే నూతనంగా నియమితులైన బిజెపి జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు కు ఉమ్మడి నిజాంసాగర్ బిజెపి నాయకులు కామారెడ్డి బిజెపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త బిజెపి నాయకులు కొండ అనిల్ గుప్తా మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ విజయానికి మండలంలోని పార్టీ కార్యకర్తలు అందరం కలిసి పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయిని సాయిలు, ఒంటరి నారాయణరెడ్డి, బీజేవైఎం రాజు, పండరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదం పట్ల హర్షం

నవతెలంగాణ-మద్నూర్



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ కోసం ముఖ్యమంత్రి వద్ద జుక్కల్ ఎమ్మెల్యే చేసిన ప్రయత్నాలు ఫలింపజేశాయని, ఎమ్మెల్యే కృషి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. డోంగ్లి మండల కేంద్రంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శేషాంక్ పటేల్ , గజు దేశాయ్ , యూనుస్ పటేల్, చాంద్ పటేల్, నాగేష్ పటేల్, కలిం పటేల్, శ్రీధర్,విలాస్, లక్ష్మణ్, హన్మంత,మారుతి,సుభాష్,దిలీపకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యానమందిరానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మంగిరాములు మహారాజ్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన ధ్యానదంపతులు బద్దం రజిత దేవేంధర్ వారి ఇంటివద్ద నూతనంగా నిర్మించే ధ్యానమందిరానికి నందిపేట్ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. జగద్గురు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రిజీ ఆశయసాధనలో భాగంగా పిరమిడ్ నిర్మాణాన్ని చేస్తున్నామని బద్దం రజిత దేవేంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వందకుపైగా ధ్యానులు పాల్గొన్నారు

చేపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలోని పలు వార్డుల్లో రూ.16 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణాలకు, డ్రయినేజీ పనులకు మాజీ నీటి పారుదల సంఘం చైర్మెన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాళ్ల సాయిరెడ్డి, మండలాధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేపూర్ పల్లె (హరిపూర్) కాంగ్రెపార్టీ గ్రామ శాఖల పార్టీ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, రాంసిన్, మాజీ సర్పంచ్‌లు ఇందూర్ సాయన్న, గంగారెడ్డి, మాజీ ఎంపిటిసి జన్నెపల్లి గంగాధర్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు కటికే శ్రీనివాస్, సొసైటీ మాజీ డైరెక్టర్ సారంగి శాంతికుమార్, ఓబీసీ మండలాధ్యక్షుడు వినోద్, మాజీ వార్డ్‌మెంబర్ ఆరె రాజు, సాయన్న, సొక్కం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి త్యాగం మరువలేనిది

- ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత
- రామాబాయి జయంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్/భీంగల్ రూరల్

బాబా సాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి త్యాగం మరువలేనిదని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. రమాబాయి జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. బాబా సాహెబ్ అంబేద్కర్ మనదేశంతో పాటు ప్రపంచ దేశాలు కూడా గుర్తించుకునే విధంగా బాబాసాహెబ్ అంబేద్కర్ నిలిచారంటే వారి సతీమణి తన సర్వస్వం త్యాగం చేసి సహకరించడం వల్లేనని అన్నారు. ఈరోజు చరిత్రలో నిలిచిన ఘనత అంబేద్కర్‌కు దక్కిందని తెలిపారు. మన పూర్వీకులు చేసిన త్యాగాలను గుర్తించుకుని.. వారు


కంఠేశ్వర్ : పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా బృందం

సమాజంలో నిలిచిపోవడానికి ప్రోత్సహించిన వారిని, వారి త్యాగాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం మనకు ఉందని గుర్తుచేశారు. ఎందరో మహనీయుల జీవితాన్ని త్యాగం చేసి మనకి ఇచ్చిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ వారి త్యాగాలను గుర్తు చేసుకొని మన వంతుగా కూడా మనం సహకరిస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, జిల్లా కమిటీ సభ్యురాలు మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలు సామాజిక సంఘాల నేతలైన అంగరి ప్రదీప్, పింజ అశోక్ అధ్యక్షతన మాత రమాబాయి 127వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కరైట్ ప్రముఖులు మాట్లాడుతూ.. తల్లీ రమాబాయి తన నలుగురు పిల్లల్ని సమాజానికి త్యాగం చేసిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఉద్య మ నాయ కురాలు రమాబా యి "మహాడ్ సత్యాగ్రహం"లో దాడికి గురైన వారిని పరామర్శి ంచారని, "కాల ారాం మందిర్ ఉద్యమాని"కి అన్ని రకాల సహాయం అందించిన ఘనత ఆమెకే దక్కిం దన్నా రు. అంబేద్కర్‌కు మానసిక శాంతిని కల్పిం చారని వివరించారు. ఆమె ఆదర్శాలను ప్రతి కార్యకర్త అనుసరించాలని ఈ సందర్భంగా వా రు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా రమాబా యి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్పన కదం, పరిమిత పవార్, శిల్పా పవార్, అనురాధ, పద్మిని, రాజు జాదవ్, వికాస్ పవార్, ఇత్వార్‌పేట్ లింగన్న, కొక్కర భూమన్న మాదిగ, ఆర్గుల సురేష్, మమత, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ రూరల్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాతా రమాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయ కులు మాట్లాడుతూ.. అంబేద్కర్ విదేశాలలో ఉన్నత విద్య కోసం రమాబాయి ఎంతో కృషి చేశారని అన్నారు. తమ పిల్లలు అనారోగ్యంతో చనిపోతున్నా.. ఈ దేశ అణగారిన వర్గాల పీడత ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన, గొప్ప త్యాగశీలి రమాబాయి అని మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బట్టు అనిల్, భీమ రవీందర్, మేకల శ్రీనివాస్, రాహుల్, రమేష్, గుర్రం రాజేశ్వర్, బట్టు సునీల్, గన్న వినయ్, తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో..


భీంగల్ పట్టణంలో..

ఢిల్లీలో ధర్నాకు తరలిన వికలాంగులు



ధర్నాకు తరలివెళ్తున్న వికలాంగులు, నాయకులు

నవతెలంగాణ-బోధన్

తమ న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎన్‌పీఆర్‌డీ యూనియన్ ఆధ్వర్యంలో వికలాంగులు దేశ రాజధాని ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు నెలకు 3000 మాత్రమే పెన్షన్ ఇస్తుందని, దానిని తిరిగి నెలకు 5000 రూపాయలకు పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి వికలాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డులు 2016 చట్టం ప్రకారం ఇవ్వాలని, ప్రతి వికలాంగుడికి ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు పనిదినాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ పరిధి పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్ వికలాంగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులందరికీ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలని, వికలాంగులు చదువుకోవడానికి అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకమైన స్కూల్లో ప్రవేశాలకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు చలో ఢిల్లీకి వెళ్ళనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మహా ధర్నా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు గంపల శంకర్, జిల్లా కోశాధికారి రామ్‌పటేల్, నాగనాథ్ పటేల్, ఎల్లయ్య, సాయిలు, చింటూ, సాయినాథ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ఆరెపల్లి ఆనంద్ బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి ఆర్థిక సాయం కింద మంజూరైన రూ.60,000 రూపాయల చెక్కును గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో మరొకరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును టౌన్ ఇంచార్జ్ ముస్కు మోహన్ ఆధ్వర్యంలో బాధిత లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, మాజీ ఉప సర్పంచులు ఏట్టెం మహేష్, జక్క గంగాధర్, రాజ్ కుమార్, యూత్ అధ్యక్షులు ధనుష్ యాదవ్, ఏలేటి మల్లారెడ్డి, సందీప్, లింగన్న, అశోక్, మయూర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి



నామినేషన్ దాఖలు చేస్తున్న నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ నమ్మకాన్ని నిలబెడతానని చెప్పారు. ఫిబ్రవరి 10వ తేదీన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నానని తెలిపారు. భారీ ఎత్తున ర్యాలీ చేపట్టబోతున్నామని చెప్పారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించిందని కొనియాడారు. పార్టీ పథకాలతో పాటుగా నరేంద్రుడి నవరత్నాలు పేరిట మేనిఫెస్టోతో పట్టభద్రుల వద్దకు చేరుకోబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, సన్నిహితులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.3లక్షల నగదు, 10 తులాల బంగారం అగ్నికి ఆహుతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదం ఓ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. పెంకుటి ఇంటిలో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయట పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ప్రమాదంలో సుమలత, ప్రసాద్‌కు సంబంధించిన మూడు లక్షల నగదు, 10 తులాల బంగారం, 15 తులాల వెండి, ఇంటి సామగ్రి కాలి బూడిదయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించినా.. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి పురాతన పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైంది.

బీమా చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

నవతెలంగాణ-బోధన్

బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ బోధన్ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ పట్టణంలో ఎల్ఐసీ ఆఫీస్‌లో విరామ సమయంలో బీమా రంగంలో విదేశీ పెటుబడులకు నిరసనగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయి యూనియన్ నాయకులు రాకేష్, నరసయ్య మాట్లాడుతూ.. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అవసరం ఏమాత్రం లేదన్నారు. కానీ బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు 1999లో 26 శాతం, 2015లో 49శాతం, 2021లో 74 శాతం అనుమతినిచ్చాయన్నారు. ఇప్పుడు 100 శాతానికి పెంచాలని ప్రభుత్వం యోచిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్య విదేశీ పెట్టబడుదారులకు మన దేశీయ పొదుపు మీద పూర్తి నియంత్రణకు వీలు కల్పిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతాన్ని 74 నుంచి 100 శాతానికి పెంచే తిరోగమన దేశ వ్యతిరేక ప్రతిపాదనలు ఉన్న బీమా చట్ట సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సత్యనారాయణ, గంగారం, జీవన్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు

గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలతో రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ ఎంఓయూ

- పోటీ పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేస్తాం
- విద్యార్థులకు వెబ్ సెమినార్ ద్వారా పాఠాలు
- రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కీలక అడుగు ముందుకేసింది. ఈ మేరకు ఆ కళాశాల రాష్ట్ర గ్రంథాలయాల సంస్థతో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సైదా జైనబ్ కీలకమైన ఎంఓయూపై సంతకాలు చేశారు. కళాశాల గ్రంథాలయాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఈ ఒప్పందం తోడ్పడనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, అధ్యాపకురాలు రమ్య విద్యార్థులతో వెబ్ సెమినార్ నిర్వహించారు. నిజామాబాద్ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఇకనుండి వెబ్ సెమినార్ల ద్వారా క్లాసులు ఇవనున్నట్లు వెల్లడించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తూ కావలసిన మెటీరియల్‌ను కూడా గ్రంథాలయ సంస్థ నుంచి అందజేసేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నవత, షేక్ హీనా, మౌనిక, శ్రావణి, ప్రియాంక పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

- సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

ప్రతి ఉపాధ్యాయుడు విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే విద్యార్థులు పోటీ ప్రపంచానికి ధీటుగా ఎదుగుతారని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలంలోని మాణిక్‌బండార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగు ఉపాధ్యాయుల ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డ్ సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన అకాడమిక్ మోడరింగ్ ఆఫీసర్ జీవన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికత ఉపాధ్యాయులను బలోపేతం చేస్తుందని అన్నారు. శిక్షణ కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన ఘనపురం దేవేందర్ ఉన్నత పాఠశాలలో ప్రవేశపెట్టిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను ఎలా వినియోగించుకోవాలో, చాక్‌పీస్ వాడకుండా ఎలా బోధించాలో, సబ్జెక్టుకు సంబంధించిన ఆడియో వీడియో ఇమేజ్‌లను ఎలా వాడాలో సమగ్రంగా వివరించారు. మరో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ శివ నాగమణి లర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సులను ఉపయోగి ంచి విద్యార్థులకు ఆసక్తికర ంగా ఎలా బోధించాలో తెలిపారు. ఈ కార్యక్రమ ంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు, కోర్స్ డైరెక్టర్ భారతి, ఆర్‌యుపిపి తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి రమణాచారి, డాక్టర్ గంట్యాల ప్రసాద్, డాక్టర్ కాసర్ల, గోవర్ధన్, గంగాధర్, గంధం విజయలక్ష్మి, కేసీ లింగం, ఆల్గోట్ గంగాధర్, దస్తగిరి, కోకిల నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి

కిసాన్ తాండ గ్రామంలో భవానీమాత, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్‌తాండా గ్రామంలో గత మూడు రోజులుగా భవానీమాత, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో ఈనెల 5న విగ్రహ ఊరేగింపు, గణపతి ఆరాధన, రిత్విక వర్ణం, అగ్ని ప్రతిష్ట ధ్వజతోరణ పూజ, మహా కుంభ పూజలతో కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం భవానీమాత సాహిత గురు సేవాలాల్ విగ్ర యంత్రం ప్రతిష్టాపన, శిఖర ప్రతిష్టాపన, ప్రాణ ప్రతిష్టాపన, మహా పూర్ణాహుతి, కుంబాభిషేకం బలి ప్రదానం, శాంతి కళ్యాణం, కార్యక్రమాలను నిర్వహించి అంగరంగ వైభవంగా భవానీమాత సాయిసా గురు సేవాలాల్ మహారాజ్ విగ్ర ప్రతిష్టాపనను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా శక్తి పీఠం జాతీయ ప్రధాన కార్యదర్శి బధ్యానాయక్ రాథోడ్, నిర్వాహకులు ధన్‌సింగ్ నాయక్ రాథోడ్, జరుప్ల నరేష్, రాథోడ్ లాలు, మలోత్ శంకర్, మలోతి విజయ్, పీర్‌సింగ్ రాథోడ్, దూప్‌సింగ్, చందర్ నాయక్, గణేష్ నాయక్, మోతిలాల్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్విక్‌కు సన్మానించారు. విగ్రహ ప్రతిష్టాపనకు సుమారుగా నాలుగు లక్షల రూపాయల వ్యయంతో కార్యక్రమాలను పూర్తి చేశారు. ఈ మూడు రోజులకు అన్నదాన కార్యక్రమానికి రెంజల్ వాస్తవ్యులు అశోక్ సెట్ ముందుకు వచ్చారని వారు పేర్కొన్నారు.

అబాకస్‌లో రాష్ట్రస్థాయి మూడవ ర్యాంకు సాధించిన చతుర్య

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రస్థాయి అబాకస్ కాంపిటీషన్ ఎగ్జామ్ హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 3వ ర్యాంక్ సాధించిన చతుర్యను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు చేతుల మీదుగా షీల్డ్ బహుకరించారు. అనంతరం అభినందనలు తెలిపారు. మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కొటార్మూర్‌లో భరత్ చంద్ర స్కూల్ కరస్పాండెంట్ మల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులను చదువుతో పాటు ఆటపాటలలో సైతం ముందుంచుతున్నామని అన్నారు. స్కూల్లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థిని చతుర్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో నటరాజ నృత్యానికేతన్ నాట్య గురువు డాక్టర్ బాశెట్టి మృణాళిని, చిన్నారి తల్లిదండ్రులు తొగర్ల రాజు, సంధ్య తదితరులు అభినందించారు.


చతుర్యకు షీల్డ్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా వ్యతిరేక కార్పోరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, కేంద్ర బడ్జెట్ సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్ అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10న చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల తెలంగాణకు అన్యాయమే జరిగిందన్నారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు కార్పొరేట్లకు అనుకూలంగా తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 10న ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమం ఉందని, దీనికి దళితులు, విద్యార్థులు, యువకులు, కార్మికులు, రైతులు, మహిళలు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

- టిపిసిసి అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని టిపిసిసి అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్ చిన్న సూచించారు. ఆలూరు మండలం డీకంపల్లి గ్రామంలో శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ దేగాం ప్రమోద్, ఓబిసి జిల్లా సెక్రెటరీ ప్రవీణ్, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

12న ద్రోణగిరి గుట్ట జాతర

నవతెలంగాణ-ముప్కాల్

'శ్రీ శివ శ్రీనివాస దేవస్థానం' ముప్కాల్ ఆలయ ద్రోణగిరి గుట్ట జాతరను ఈ నెల 10వ తేదీ 12 వరకు మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్ద రమేష్ తెలిపారు. 12న స్వామివారి కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సెక్రటరీ నేర నర్సయ్య, కోశాధికారి ముస్కు చిన్న నర్సయ్య కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | ఫిబ్రవరి 08, 2025 | www.navatelangana.com

కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-రామారెడ్డి



కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వతరగతి విద్యార్థులతో మాట్లాడారు. దినచర్య అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. తరగతి గదులు, మూత్రశాలలు, వంట గదులు, స్టోర్ రూమ్స్ పరిశీలించారు. వంటగదిలను ప్రతిరోజు శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, ప్రిన్సిపాల్ శివరాం, జోనల్ అధికారి పూర్ణచందర్, తహసిల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, మండల విద్యాధికారి ఆనంద్ రావు ఉన్నారు.

రాకెట్లు, గ్రహాంతర ఉపగ్రహాల నమూనాల ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నమూనాల ప్రదర్శనలో పాల్గొన్న పలువురు

అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెలెన్స్ (క.ఐ.వై.ఇ), డి.ఆర్.డి.ఓ, యన్.ఆర్.ఐ, ఇస్రోల ఆధ్వర్యంలో రాకెట్లు, గ్రహంతర ఉపగ్రహాల నమూనాల ప్రదర్శనను జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కాలేజ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించారు. 21 పాఠశాలల నుంచి సుమారు 2200 విద్యార్థిని, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉమెన్స్ ఎడ్యూకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, రవి పబ్లిక్ స్కూల్ చైర్మన్ సరళామహేంధర్‌రెడ్డి, డి.ఆర్.డి.ఓ, యన్.ఆర్.యస్.సి. ఇస్రో శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ ఆడబిడ్డలకు సమాజమే అమ్మానాన్న



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల**

నవతెలంగాణ-కంఠేశ్వర్



చిన్నారులకు టీకాలు వేస్తున్న దృశ్యం

అనాథ ఆడబిడ్డలకు సమాజమే అమ్మానాన్న అని, వారి బాగోగులు మన అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సునీత కుంచాల అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రిలో క్యాన్సర్ నిరోధక టీకాలను గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో బాలసదన్ చిన్నా రులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. ప్రధానంగా జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్య కారణాలవల్ల నేడు క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయని అన్నారు. మహిళల్లో 90 శాతం వరకు గర్భసంచి క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నందున హెచ్‌పివి క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్‌లను బాల సదన్ ఆడపిల్లలకు 12 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల లోపు కలిగిన చిన్నారులకు ఇవ్వటం వల్ల వారిని క్యాన్సర్ల నుంచి కాపాడిన వారము అవుతామని అన్నారు. ఈ హెచ్‌పివి వ్యాక్సిన్లు అమెరికా వంటి దేశంలో మహిళలు తీసుకోవడం వల్ల 95 శాతం క్యాన్సర్ల బారి నుంచి రక్షించబడ్డారని అన్నారు. ఈ సందర్భంగా ఐఎంఎ నిజామాబాద్ జిల్లా బాధ్యులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి మాట్లాడుతూ.. క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడటం ముఖ్యమని, కాబట్టి ఈ హెచ్‌పివి వ్యాక్సిన్లు భారతదేశంలో ఇప్పుడిప్పుడే మొదలైందని దాన్ని ప్రథమంగా నిజామాబాద్ జిల్లాలో గ్రేస్ క్యాన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో బాల సదన్ చిన్నారులకు అందజేసినట్టు తెలిపారు. ఈ వ్యాక్సిన్లు సుమారు రూ.2000 నుంచి 3000 వరకు ఉంటుందని దీన్ని మూడు డోసులుగా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సరళా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ శైలజ, బాలసదన్ సూపరింటెండెంట్ వినోద, నిజామాబాద్ క్యాన్సర్ ఆసుపత్రి డాక్టర్లు గోవిందు, సిబ్బంది, డిఎల్ఎస్ఎ నాగేందర్, పిఎల్‌వీలు, ఉమా మహేశ్వర్, వినీల, బాల సదన్ చిన్నారులు పాల్గొన్నారు.

ఆహార కల్తీ మహమ్మారిపై అంగన్వాడీ కేంద్రాల్లో చైతన్య సదస్సు



చైతన్య సదస్సులో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఘన్‌పూర్, కులాస్‌పూర్ అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార కల్తీ అయోడిన్ ఉప్పులో ప్లాస్టిక్ అంశంపై చైతన్య సదస్సును నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. ఆహార కల్తీ మహమ్మారి రోజురోజుకూ విజృంభిస్తున్న క్రమంలో వినియోగదారులుగా అందరూ చైతన్యవంతులు కావాలని అన్నారు. ఉప్పు, పప్పులు, వంటనూనెలు మొదలుకొని వివిధ రకాల అయోడిన్ ఉప్పులు, ప్లాస్టిక్ సంచుల్లో అమ్మకం జరుగుతున్నందున మైక్రో ప్లాస్టిక్ కడుపులోకి చేరడం, క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ వలన అయోడిన్ ఉప్పు లక్ష్యం వృథా అవుతున్నదని.. కాబట్టి అన్ని రకాల ఉప్పు తయారీ దారులు ప్లాస్టిక్ కవర్‌లలో ప్యాకింగ్ చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు రాజుల రామనాథం, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి మహాదేవుని శ్రీనివాస్, ఎటకార్ల దేవేష్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు పొడపల్లి అనిల్, అంగన్వాడి టీచర్ శారదా, రజిత తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించాలి

- సెంటర్‌లను తనిఖీ చేసిన కలెక్టర్



భీంగల్ రూరల్ : వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్/వేల్పూర్(కమ్మర్‌పల్లి)/ఆర్మూర్

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలతో కూడిన శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని భీంగల్, వేల్పూర్, పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న వసతులను తనిఖీ చేశారు. ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటి వసతి ఇత్యాది సదుపాయాలను పరిశీలించారు. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఎంపిక చేసిన పోలింగ్ స్టేషన్లలో లోటుపాట్లు లేకుండా అన్ని సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

అనంతరం భీంగల్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన దుప్పట్లు, కాస్మోటిక్ కిట్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇతర సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు కూడా వీటి పంపిణీ జరిగిందా అని ఆరా తీశారు. పలు తరగతి గదులకు వెళ్లి బోధనా తీరును పరిశీలించిన కలెక్టర్, బాలబాలికలకు పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. వార్షిక పరీక్షలు సమీపించినందున సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతిలో అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లతో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా వారిని అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, భీంగల్‌లో తహసీల్దార్ మమ్మద్ షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఎస్ఐ జీ.మహేశ్, స్థానిక అధికారులు ఉన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఖాయం

- **అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఖాయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కులగణన గొప్పగా చేశామని చెబుతున్నా.. తమంత గొప్ప పార్టీ, గొప్ప నాయకులు దేశంలో ఎవరు లేరన్నట్టు అసెంబ్లీలో తీర్మానం పెడుతున్నామని బీసీ వర్గం ప్రజలను మోసం చేసే కుట్ర అసెంబ్లీలో జరిగిందన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా..

కోటగల్లీ మార్కెండేయ గుడి పక్క వీధిలో మధిర ప్రసాద్, సుమలత నివసిస్తున్న ఇండ్లు ఉదయం 10:30 నిముషాల సమయంలో ఇంట్లో వెలిగించిన దీపం కారణంగా ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ వెంటనే ఘటనా స్థలాన్ని చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ట్రస్ట్ ద్వారా స్వంతంగా బాధిత కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయం చేస్తానని హామీనిచ్చారు. ఆర్డిఓతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు పునరావాస కల్పన, ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్‌తో మాట్లాడి ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి వచ్చే ఇందిరమ్మ ఇండ్ల 5 లక్షల ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, జగన్, ఆనంద్, మఠం పవన్, మున్నా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

11వ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ క్రీడాకారులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

డిసెంబర్ 16న జడ్పిహెచ్ఎస్ బాయ్స్ ఆర్మూర్ క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ సీనియర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలలో జడ్పిహెచ్ఎస్ తొర్లికొండ క్రీడాకారులు బానోత్ రాజు, చలిగంటి సుశాంత్ పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచి ఈనెల 8 నుంచి 9 వరకు వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్, బొల్లంకుంట, హనుమకొండ జిల్లాలో జరిగే 11వ రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గ్రామాల్లో పశువైద్యశిబిరాలు

నవతెలంగాణ-పిట్లం



గేదెలకు గర్భధారణ చికిత్స నిర్వహిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్

మండలంలోని పలు గ్రామాల్లో పాడి పశువుల ఆరోగ్యం, సంతానోత్పత్తి శిబిరం నిర్వహించినట్టు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ముజీద్ అన్నారు. శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నకొడపుగల్ , ధర్మారం గ్రామాలలో పశు ఆరోగ్యము , సంతానోత్పత్తి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు తమ ఆవుల , గేదెల ఆరోగ్యము పై శ్రద్ధ వహించినట్లయితే అవి అధిక పాల దిగు బడిని స్తాయని అన్నారు. ఇట్టి శిబిరంలో 67 గేదెలు , 24 ఆవులకు గర్భధా రణ పరీక్షలు నిర్వహించగా 120 దూడలకు నులిపురుగుల మందులు ఇచ్చి నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సంతోష్, డాక్టర్ మణికుమార్, గోపాలమిత్ర సూపర్వైజర్ బసవరాజ్, గోపాల మిత్రు లు హమ్మద్ , గౌస్ , పండరి , ఓఎస్ శ్రీను రైతులు తదితరులు పాల్గొన్నారు.

మడమ తిప్పడం కాంగ్రెస్ పేటెంట్

- **అలివిగాని హామీ లిచ్చి అధికారంలోకి వచ్చింది**
- **గద్దెనెక్కగానే మాట మార్చి ప్రజలను మోసం చేసింది**
- **అసలు ఆరు గ్యారెంటీలే పెద్ద డ్రామా**
- **మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి**

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి

మాటతప్పడం, మడమ తిప్పడం కాంగ్రెస్‌కు మాత్రమే ఉన్న పేటెంట్ హక్కు అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో అలివిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. గద్దెనెక్కగానే మాట మార్చి ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఆయన ఎద్దేవా చేశారు. వెన్నుపోటు పొడవడం కాంగ్రెస్‌కు కొత్తకాదని, ఇది నూరేళ్ళ భాగోతమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఇచ్చే ఎన్నికల హామీలు ఒక నాటకమని ఆ పార్టీ నేతలు చెప్పే మాటలు పచ్చి బూటకమని జీవన్ రెడ్డి మండిపడ్డారు. అసలు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలే పెద్ద డ్రామాగా, ప్రజలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమగా ఆయన అభివర్ణించారు. ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలలో ఓట్ల కోసం కాంగ్రెస్ పాట్లు పడుతోందని, మరోమారు ప్రజలను ఏమార్చడానికి పగటి వేషాలు వేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అంటేనే అవినీతి గని, దేశానికి పట్టిన శని అని ఆయన అన్నారు. నమ్మి ఓటేసిన చేతినే కాటేసే కాలనాగు కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. మళ్లీ ఓట్ల కోసం గ్రామాలకొచ్చే కాంగ్రెస్ నేతలను నిలేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఆరు గ్యారెంటీలు ఎందుకు అమలు చేయలేదని తిరగబడాలి. గ్రామ పొలిమేరలు దాటే వరకూ తరిమి కొట్టాలి. డిసెంబర్ 9, 2023కు రుణమాఫీ చేస్తామన్నరు చేయలేదు. ఆగస్ట్ 15, 2024 వరకు రుణమాఫీ అని చెప్పిన మాట మార్చిండ్రు. మళ్లీ దసరా వరకు రుణమాఫీ అని చెప్పి నేటి వరకు చేయలేదు. ఇంకా 20 లక్షల పైచిలుకు రైతులకు రుణమాఫీ జరగలేదు. రైతు బంధు ఇప్పుడు తీసుకుంటే 10 వేలు, డిసెంబర్ 9, 2023 తర్వాత తీసుకుంటే రైతు భరోసా 15 వేలు అన్నరు. రైతు భరోసా ఎగ్గొట్టారు. యాసంగి భరోసా సంక్రాంతికి ఇస్తమన్నరు. మాట మార్చి 26 జనవరికి అన్నరు. ఇప్పుడు మార్చి 31 వరకు అంటున్నరు. కేసీఆర్ రైతు బంధు ఇచ్చి రైతన్నకు దన్నుగా నిలిస్తే, దాన్ని ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి రైతులకు భరోసా లేకుండా చేసిండు. దీనిపై రైతులంతా ఏకమై మీ ఊళ్ళకొచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టుకొని నిలదీయాలి.' అని అన్నారు.

బీసీల గొంతుకోసిన రేవంత్..

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని ఆయన ఆరో పించారు. వెనుకబడిన వర్గాలకు ద్రోహం చేస్తూ కాంగ్రెస్ నిజస్వరూపం బయట పెట్టుకుందన్నారు. తూతూ మంత్రంగా సర్వే చేశారని, బీసీ కమిషన్ చైర్మన్ కూడా సర్వే రిపోర్ట్‌ను తప్పు బట్టారన్నారు. 30 లక్షల మేర బీసీల జనాభాను తక్కువ చేసి చూపారని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ శరాఘాతంగా మారిందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్‌ను తిడుతుండని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మాజీ నగర మేయర్ దండు నీతూ కిరణ్, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆడ, మగ ఇద్దరూ సమానం

- **ఐసిడిఎస్ సిడిపిఓ జ్యోతి**

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న సీడీపీవో జ్యోతి

ఆడపిల్లలు, మగ పిల్లలు సమాజంలో సమానమని, ఇద్దరికీ కూడా సమాన హక్కులున్నాయని ఐసిడిఎస్ సిడిపిఓ జ్యోతి అన్నారు. మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిచ్‌పల్లి ప్రాజెక్ట్ పరిధిలోని ఇందల్‌వాయి మండల పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామం వద్ద గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థినీలతో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ జ్యోతి పాల్గొని మాట్లాడుతూ.. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపవరింగ్ ద గర్ల్స్ ఫర్ బ్రైట్ ఫ్యూచర్ అంటూ బేటి బచావో బేటి పడావో అనే ఐదు ఉద్దేశాలను తెలుపుతుందని వివరించారు. ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడం, లింగ నిష్పత్తిని తగ్గుదలను అరకట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శోభ, సునీత, డిహెచ్ఈడబ్ల్యూ డిఎంసి స్వప్న ప్రిన్సిపాల్ పద్మజ, ఐసిడీఎస్ కౌన్సిలర్ జమురు, చైల్డ్‌లైన్ సూపర్వైజర్ భీక్ సింగ్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రంజీత్, అంగన్వాడీ టీచర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్వేష్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



అన్వేష్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తెలంగాణ విత్తనాభి వృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని జిల్లా పేదరిక నిర్మూల సంస్థలో పనిచేస్తున్న జేఏసీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఆర్మూర్‌లోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అన్వేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పేదరిక నిర్మూలన సంస్థ జిల్లా జేఏసీ కార్యదర్శి రవి, ఆర్మూర్ టీఎన్జీవోస్ బాధ్యులు గంగారం, సీసీలు తిరుపతి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

- **ఏఎస్‌పి చైతన్య రెడ్డి**

నవతెలంగాణ-భిక్కనూర్



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఏ ఎస్ పి చైతన్య రెడ్డి పోలీసులకు సూచించారు. శుక్రవారం మండలంలోని 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, ఇండికేటర్ సిగ్నలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి జాతీయ రహదారిపై హైవే అథారిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

ఈ నెల 27వ తేదీన జరగబోయే పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మద్నూర్ మండల కేంద్రంలోనీ ఉర్దూ మీడియం పాఠశాలలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి (ఐఏఎస్) పరిశీలించారు. రెండు తరగతి గదులను పరిశీలించారు. ఒకటి పట్టభద్రుల ఓటర్ల కొరకు, మరోటి ఉపాధ్యాయ ఓటర్ల కొరకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిధిలో ధరఖాస్తు చేసుకున్న ఓటర్లు పట్టభద్రుల ఓటర్లు 417 మంది ఉపాధ్యాయ ఓటర్లు 49 మంది 27న జరిగే పోలింగ్ రోజు ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని అన్నారు. సబ్ కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఎం డి ముజీబ్, ఎంపీవో వెంకట నర్సయ్య, గిర్దవర్ ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను సందర్శించిన ఆర్టీసీ ఆర్ఎం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ను శుక్రవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోతి సందర్శించారు. అనంతరం బస్టాండ్‌లో నెలకొన్నటు వంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగు దొడ్లు మూత్రశాలలో వినియోగంలో ఉన్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసినటువంటి పెట్రోల్ బంక్ ఎందుకు నడపడం లేదని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిలిచిపోయినందుకు గల కారణాలను పూర్తిస్థాయిలో సమాచారం అందించాలన్నారు. ఆమె వెంట అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ సరస్వతి కామారెడ్డి మేనేజర్ ఇందిరా తదితరులు ఉన్నారు.